ప్రజాశక్తి
మంగళవారం 5 డిసెంబర్ 2023
5
శ్రీ సత్యసాయి



మేలు చేయడానికే కులగణన



సామాజిక సాధికార బస్సుయాత్రలో పాల్గొన్న మంత్రులు, వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు

పేదరికం పది శాతం తగ్గింది

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

రాప్తాడులో సామాజిక సాధికార బస్సుయాత్ర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాజ్యాంగ ఫలాలు అందుకోవడానికి దూరంగానున్న అన్ని కులాలకు మేలు చేయడానికే వైసిపి ప్రభుత్వం కుల గణనను చేపట్టిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర సోమవారం నాడు రాప్తాడులో జరిగింది. ఈ కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, మాజీ మంత్రి శంకర నారాయణ, పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్, బాపట్ల ఎంపీ నందిగామ సురేష్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనార్టీలకు న్యాయం చేస్తున్నది వైసిపి మాత్రమేనని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ వర్గాలకు మేలు చేయడానికి చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో కులగణను చేపట్టారని వివరించారు. ఇప్పటి వరకు రాజ్యాధికారానికి దూరంగానున్న కులాలకు రాజ్యాధికారం అందివ్వాలన్నదే ఆయన ఉద్దేశమని చెప్పారు. ఈ నాలుగేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రంలో పేదరికం తగ్గిందదన్నారు. వైసిపి అధికారంలోకి రాకముందు 16 శాతం పేదరికముండేదని చెప్పారు. అది ఆరు శాతానికి తగ్గించారని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా వంటి చోట్ల వలసలు కూడా ఆగిపోయాయని తెలిపారు. కార్మిక శాఖ మంత్రి జయరాం మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల కోసం నవరత్నాలు పెట్టారని చెప్పారు. ఈ పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ మేలు జరిగిందన్నారు. కుటుంబానికి మేలు జరగకుంటే తనకు ఓటు కూడా వేయవద్దని చెప్పే ధైర్యం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి ఉందన్నారు. చంద్రబాబునాయుడు అంతా కుట్రలు, కుతంత్రాలేనని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలిస్తే అది తన ఘనతేనన్నట్టుగా చెప్పుకునే విధంగానున్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ ఇద్దరూ మోసపూరిత హామీలను నమ్మొద్దని విమర్శించారు. బాపట్ల ఎంపీ నందిగామ సురేష్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు వెన్నుపోటుదారుడున్నారు. మామ ఎన్టీఆర్‌కే వెన్నుపొడిచారని విమర్శించారు. రాబోయే రోజుల్లో పవన్ కళ్యాణ్‌కు వెన్నుపోటు తప్పదని హెచ్చరించారు. వారి మోసపూరిత మాటలు నమ్మొద్దని హెచ్చరించారు. ప్రజలకు మేలు జరగాలంటే వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ స్థానిక సంస్థలు మొదలుకుని అన్ని రాజకీయ పదవుల్లో బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు సమ ప్రాధాన్యతను వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కల్పించారని తెలిపారు. ఆయనతోనే సామాజిక సాధికారత సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహమ్మద్, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ మూత.. జనంకు అవస్థ..!

పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం - గ్రామస్తులకు ఇబ్బందులు

ప్రజాశక్తి-హిందూపురం



మరమ్మతుకు గురై, మూతబడిన వాటర్‌ప్లాంట్

పంచాయతీ ప్రజల కోసం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్ర నిర్వహణపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఆ కేంద్రం మూతబడింది. గత ఆరు నెలలుగా ఇది మూతబడింది. శుద్ధ జలం లేక హిందూపురం రూరల్ మండలం తూమకుంట పంచాయతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూమకుంట పారిశ్రామికవాడలోని ఓ రసాయన పరిశ్రమ నిర్వహకులు తూముకుంట గ్రామ ప్రజల కోరిక మేరకు దాహార్తిని తీర్చడానికి సుమారు 8 సంవత్సరాల క్రితం లక్షలాది రూపాయలు వెచ్చించి శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ బాధ్యతను పంచాయతీకి అప్పజెప్పారు. అయితే దీని నిర్వహణపై పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వహించడంతో గత ఆరు నెలల నుంచి ఇది మూతబడింది. దీంతో గ్రామస్తులు ప్రయివేటు వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయిస్తున్నారు. డబ్బులు పెట్టి కొనలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయివేటు వారు అందించే నీటిలో వివిధ రసాయనాలను కలుపుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌ను మరమతులు చేయించి వినియోగంలోకి తేవాలని తూముకుంట పారిశ్రామికవాడ గ్రామస్తులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

తూమకుంట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఇటీవలే నేను బాధ్యతలను స్వీకరించాను. గ్రామంలో పంచాయతీ నిర్వహణలో వాటర్‌ప్లాంట్ ఉన్నట్లు తమ దృష్టిలో లేదు. దీనిని పరిశీలన చేసి, సర్పంచితో సమన్వయం చేసుకుని, సంబంధిత ఇంజినీర్లతో అంచనా వేయించి, వారంలోగా మరమ్మతులు చేయిస్తాం.

కెంచరాయప్ప,
పంచాయతీ కార్యదర్శి.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్రంలో తుఫాన్ ఏర్పడిన సందర్భంగా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి వైఎస్.జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్పి మాధవరెడ్డి, సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఒ కొండయ్య పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళ, బుధవారాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. తుఫాన్ నేపథ్యంలో హెచ్చరించినందున ప్రజలతోపాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమీప నది తీర ప్రాంతాల్లో నదులు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. భారీ వర్షాలకు పంట నష్టం, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ముందుగా అటువంటి సందర్భాలలో అధికారులు పూర్తి జాగ్రత్త వహించాలన్నారు. ఏదైనా ప్రమాదం సంభవించిన వెంటనే మండల కేంద్రాలు, సచివాలయాలు, ప్రజలు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఇ సంజీవయ్య, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'వై ఎపి నీడ్స్ జగన్'కు స్పందన కరువు

ప్రజాశక్తి అమరాపురం

మండల పరిధిలోని మద్దనకుంట గ్రామ సచివాలయంలో సర్పంచి గోవిందప్ప ఆధ్వర్యంలో సోమవారం 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తప్ప ప్రజల నుంచి స్పందన లేకపోడంతో స్థానిక ఎంపిటిసి హనుమంతరాయప్ప ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మదనకుంట పంచాయతీలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రూ. 24 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఆ వివరాలను క్షేత్రస్థాయిలో తెలియ జేసినా ప్రజల స్పందన కరువైందని, అందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అవినీతి ఆరోపణలే కారణమన్నారు. గ్రామ వాలంటీర్లు 20 మందికి పైగా ఉన్నా ఆరుగురే హాజరయ్యారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఈరన్న, జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, వైసిపి మండల కన్వీనర్ త్రిలోక్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, జీవరత్నం, నాయకులు శివకుమార్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

7న మడకశిరలో సామాజిక సాధికార బస్సుయాత్ర

ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

పట్టణంలో ఈ నెల 7వ తేదీ నిర్వహించే వైసిపి 'సామాజిక సాధికార బస్సు యాత్ర'ను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, నియోజకవర్గ పరిశీలకులు పోకుల అశోక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బి వసతి గృహంలో సోమవారం మండల స్థాయి నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వానికి సాధ్యం కాని సంక్షేమ పథకాలు, పదవులను జగన్ ప్రభుత్వం బిసిలకు కేటాయించిందన్నారు. కావున బస్సు యాత్రలో బిసిలు, ఎస్సీ, ఎస్టీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు రామిరెడ్డి, పుట్ట కామప్ప, ఎంపిపి కవితా సత్యనారాయణ, జడ్పిటిసి సరోజమ్మ గారి మూర్తి, ఛైర్‌పర్సన్ తనయుడు జయరాజ్, బజ్జప్ప, సర్పంచులు ప్రభావతి దేవుల నాయక్, ఆర్మీ మూర్తి, తిమ్మారెడ్డి, అంజన్ మూర్తి, కౌన్సిలర్లు నాగేంద్ర, అన్సర్‌ఖాన్, అంజన్, మండల సచివాలయ కన్వీనర్ నాగేంద్ర, బాలరెడ్డి, తిమ్మప్ప, మంజునాథ్, నాగభూషణ్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, రామంజి, సతీష్‌రెడ్డి, అంజలి, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

రాప్తాడు బస్సు యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర : రాప్తాడులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన వైసిపి 'సామాజిక సాధికార బస్సుయాత్ర'లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పాల్గొన్నారు. బస్సు యాత్రలో ఎమ్మెల్యే తిప్పేస్వామి సిఎం జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు రాజకీయంగా ఎదగడానికి ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదని, అది కేవలం సిఎం జగన్‌తోనే సాధ్యమైందన్నారు. మరోసారి జగన్‌ను సిఎం చేసుకోవాలని సభలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



గోడపత్రికలు విడుదల చేస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

'విద్యార్థీ మేలుకో-భవిష్యత్ కాపాడుకో'

ప్రజాశక్తి-మడకశిర

టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్‌వైటిఆర్ డిగ్రీ కళశాలలో 'విద్యార్థి మేలుకో భవిష్యత్ కాపాడుకో' అనే కార్యక్రమం నిర్వహించారు. టిఎన్ఎస్ఎఫ్ నాయకు లు మాట్లాడుతూ సిఎం జగన్ విద్యార్థులకు మేనమామ అవుతానని చెప్పి నేడు కంస మామగా మారాడని విమర్శించారు. టిడిపి పాలనలో పిజి విద్యార్థులకు ఫీజురీయింబ ర్స్‌మెంట్ ఇచ్చి బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేసిందన్నారు. విదేశాల్లో చదివే సౌలభ్యం కల్పించడంతో పాటు అనేక రకాలుగా చేయూతనందించిందన్నారు. వైసిపి అధికారం లోకి వచ్చిన తర్వాత 'నాడు-నేడు'లో భాగంగా పాఠశాలలకు రంగులు వేసి రూ. కోట్లు స్వాహా చేశారన్నారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తానని చెప్పి నేటికీ ఆ ఊసే లేదన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన అసమర్థ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని కోరారు. టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రతివిద్యార్థికి వైసిపి ప్రభుత్వ అరాచకాలను తెలియజేస్తామన్నారు. అనంతరం 'విద్యార్థి మేలుకో భవిష్యత్ కాపాడుకో' గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లుమర్రి వినయ్, ప్రధాన కార్యదర్శి సంతోష్‌యాదవ్, కార్యదర్శి గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు - నేడుతో విద్యాభివృద్ధి : డిఇఒ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నాడు నేడు అనే కార్యక్రమం ద్వారా ప్రభుత్వం రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని డిఇఒ మీనాక్షి దేవి తెలిపారు. మండల పరిధిలోని నాగులూరు గ్రామంలో గల పిసిఎంఆర్ కాన్సెప్ట్ స్కూల్లో ఏర్పాటుచేసిన అంగన్వాడి టీచర్లకు, సూపర్వైజర్లకు ఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు చిన్నారుల మనస్తత్వాన్ని అర్థం చేసుకొని సరైన విద్యాబోధన అందించాలన్నారు.. ఈ కార్యక్రమంలో పిడి లక్ష్మి కుమార్, ఎంఇఒ గోపాల్ నాయక్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

మడకశిర : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ నరసింహమూర్తి హాజరయ్యారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిల్లల చేత కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. ఎంఇఒ మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం, ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. చివరగా బహుమతులు ప్రదానం చేసి స్వీట్స్ పంపిణీ చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఓబులదేవరచెరువు : మండలంలోని మామిళ్లకుంటపల్లి, డబురవారిపల్లి, ఎం కొత్తపల్లి, కుసుమువరిపల్లిలోని పోలింగ్‌కేంద్రాలను ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కేంద్రాల్లోని సౌకర్యాలను పరిశీలించినట్లు చెప్పారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

పెనుకొండ : పట్టణ సమీపంలోని ఎన్ కన్వెన్షన్ హాలులో సోమవారం వడ్డెర్లు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవళ్ల మురళి, ఉపాధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, వెంకటగిరి పాళ్యం శ్రీనివాసులు, హనుమయ్య మాట్లాడుతూ హిందూపురం పార్లమెంటు, పుట్టపర్తి, కదిరి ఎమ్మెల్యే టికెట్లు వడ్డెర్లకు కేటాయిం చాలని, ముఖ్యంగా వడ్డెర్లను ఎస్టి జాబితాలోకి చేర్చాల న్నారు. జనవరిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, సభా వేదికను త్వరలో వెల్లడిస్తామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు, వడ్డెర్లు పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్లపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరాపురం

స్థానిక హేమ మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ పాల్గొన్నారు. ఆయనకు స్థానిక వైసిపి నాయకులు జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, ఎంపిపి ఈరన్న ఎండియు ఆపరేట్లపై ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడు తూ మండలంలో 11 చోట్ల వాహనాలు ఉన్నా ఎండి యు ఆపరేటర్లు కార్డుదా రులకు ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. కొందరు డీలర్లు రేషన్ షాపు వద్దే బియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. స్పందించిన సబ్ కలెక్టర్ ఈ నెల వేతనాలు ఆపి, ఎండియు ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలని స్థానిక తహశీల్దార్‌ను ఆదేశించారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎంపిటిసిలు నారాయణగౌడ, హనుమంతరాయప్ప, తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైసిపి ప్రజాప్రతినిధులు

ఇళ్ల స్థలాలు, పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-గోరంట్ల

మండల పరిధిలోని పాలసముద్రం గ్రామానికి చెందిన నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం పెట్టుకున్న అర్జీలను తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరుపేదలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అర్జీదారులు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం 150 మంది నిరుపేదలు పాలసముద్రం సచివాలయం లో దరఖాస్తులు అందజేసినా ఇంతవరకూ ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని వాపోయారు. పెద్దన్న మాట్లాడుతూ పాలసముద్రం క్రాస్‌లో 20 ఏళ్లుగా 20 కుటుంబాలు అనుభవంలో ఉన్న ఇళ్ల స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని 5 నెలల క్రితం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహశీల్దార్ రంగనాయకులును కోరారు. అలాగే గతంలో ఇచ్చిన పట్టాలకు ఇళ్ల స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహశీల్దార్ అర్జీలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. అలాగే అనుభవంలో ఉన్న పేదల వివరాలను పరిశీలించి మండల సర్వేయర్‌తో కొలతలు వేసి పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



ఇళ్ల స్థలాల కోసం తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన పేదలు

మూడు రోజులు ధర్మవరం-నర్సాపూర్ రైలు రద్దు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం-నర్సాపూర్ రైలు మూడు రోజుల పాటు రద్దుచేస్తున్నట్టు రైల్వేశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అల్పపీడనం కారణంగా సోమ, మంగళ, బుధవారాల్లో ధర్మవరం-నర్సాపూర్ రైలు రద్దుచేస్తున్నామని, తిరిగి యదావిధిగా నడుపుతామని చెప్పారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించాలని వారు కోరారు. వర్షం కారణంగా ఆదివారం నర్సాపూర్ - ధర్మవరం వచ్చే రైలు రెండుగంటల ఆలస్యంగా నడిచిందన్నారు.

ఓట్ల తొలగింపులో బిఎల్‌ఒలది పక్షపాత వైఖరి : టిడిపి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఓట్ల తొలగింపులో అధికార పార్టీ మెప్పుకోసం బిఎల్వోలు, మండల అధికారులు పనిచేస్తున్నారని, బిఎల్‌ఒలు నిష్పక్షపాతంగా వ్యవహరించడంలేదని టిడిపి మండల నాయకులు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, బత్తలపల్లి క్లస్టర్ ఇన్‌ఛార్జి నెట్టెం రమణ, లింగారెడ్డిపల్లి ఓబులనాయుడు, మాల్యవంతం రంగా నాయుడు తదితరులు మాట్లాడారు. డబల్ ఎంట్రీ,డెత్ తదితర ఓట్లను తొలగించాలంటూ పలుమార్లు ఆధారాలతో సహ అధికారుల దృష్టికి తీసుకు వెళుతున్న అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో బిఎల్వోలు, మండల అధికారులు విష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని ఆరోపించారు. ఇదే విధంగా వ్యవహరిస్తే కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు, బిఎల్‌ఒలు ఓట్ల తొలగింపు, మార్పులు, చేర్పులు తదితర వాటిని నిష్పక్షపాతంగా విచారించి ఓటరు జాబితాను తయారు చేయాలని సూచించారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా నరేష్ కుమార్

ప్రజాశక్తి-రొద్దం



జిసి.నరేష్ కుమార్

హిందూపురంలో ఆదివారం జరిగిన యుటిఎఫ్ 2వ కౌన్సిల్ సమావేశంలో జిల్లా కార్యదర్శిగా మండల పరిధిలోని కంచిసముద్రం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జిసి.నరేష కుమార్‌ను నియమించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల విధానాల కారణంగా విద్యారంగం ప్రయివేటీకరణ వైపు అడుగులు వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ఇపిని వ్యతిరేకించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వం, అధికారులు ఉపాధ్యాయులను వేధించడం, యాప్‌లు, తదితర పని భారం తగ్గించాలన్నారు. ఒపిఎస్, పెండింగ్ బకాయిలు, డిఎలు, పిఎఫ్‌లు, తదితరాల ఊసే లేదని విమర్శించారు. విలీనం పేరుతో పాఠశాలలను మూసివేయడం తగదన్నారు.

పాఠశాల పరిశీలన

గోరంట్ల : మండల పరిధిలోని పూలేరు పంచాయతీ మరిరెడ్డిపల్లి గ్రామం ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ సెంటర్లను సోమవారం సర్పంచి ప్రభాకర్‌రావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. అంగన్వాడీ సెంటర్‌లో బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి తహరాబి, హైదర్ వలి, వార్డు మెంబర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఎపి అభివృద్ధి

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి అధినేత చంద్రబాబుతోనే ఎపి అభివృద్ధి సాధ్యమని పట్టణ కన్వీనర్ మనోహర్ తెలిపారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం నియోజకవర్గ ఇంఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని 4, 7, 8 వార్డుల్లో తెలుగుతమ్ముల్లు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ అన్ని వార్డుల బూత్ కన్వీనర్లు ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పుల్లయ్య చౌదరి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, తెలుగు యువత అధ్యక్షుడు తిమ్మరాజు, బూత్ కన్వీనర్లు ఓబన్న, రమేష్, సిద్ధూ, శంకర్, నాయకులు ఆంజనేయులు, రవి, మంజు, రాజు, తనూజ్, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : 'బాబు ష్యూరిటీ-భవిషత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా తెలుగుతమ్ముళ్లు మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి కొట్టాలలో ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పెనుకొండ కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, హనుమంతురాయుడు, అశ్వత్థ, అంజి, ప్రశాంత్, నరేష్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

విద్యుత్‌స్తంభం ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

బత్తలపల్లి : హైటెన్షన్ విద్యుత్ వైర్లతో కూడిన విద్యుత్ స్తంభం కూలిపోకుండా ట్రాన్స్‌కో అధికారులు సరిచేశారు. మండలంలోని గుమ్మలకుంట గ్రామ సమీపాన తాగునీటి పథకం బోరు వద్ద విద్యుత్ స్తంభం ఒక ప్రక్కకు ఒరిగి ప్రమాదపు టంచున నిలిచింది. దీంతో ప్రమాదపుటంచున విద్యుత్‌స్తంభం శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ట్రాన్స్‌కో ఎఇ శివయ్య ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. జాతీయ రహదారి ప్రక్కనే ఈవిద్యుత్ స్తంభం పక్కకు వాలి ఉండటంతో సజావుగా ఏర్పాటు చేయించారు. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి ఒరిగిన స్తంభాన్ని సజావుగా ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సమగ్ర కులగణనకు సహకరించండి

బత్తలపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర కులగణనకు కుల సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధశాఖల అధికారులు తగు సూచనలు సలహాలు అందజేసి సహకరించాలని ఎంపీడీవో సాయిమనోహర్ సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానికఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 6న ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో,తహశీల్దార్ నేతృత్వంలో జరిగే సమగ్ర కుల గణనపై సమావేశానికి హాజరై సూచనలు సలహాలు అందివ్వాలని కోరారు.

ఆలయం ప్రారంభం

నంబుల పూలకుంట : మండల పరిధిలోని ధనియాని చెరువు పంచాయతీలోని డి. కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన సీతారామ లక్ష్మణ ఆంజనేయ దేవాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పూల శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి ఆయన తనవంతుగా రూ. 30వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్మవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సత్యనారాయణ

ధర్మవరం టౌన్ : ధర్మవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డిఎం మోతీలాల్‌నాయక్ అనంతపురం కార్గోకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో తాడిపత్రి డిపోలో పనిచేస్తున్న సత్యనారాయణ ఉద్యోగోన్నతిపై ధర్మవరం డిపో మేనేజర్‌గా వచ్చారు. ఆయనకు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగార్జునరెడ్డి, డిపోకార్యదర్శి ముస్తాఫా, టిఐ-3 జీపీరెడ్డి, ఆఫీసు సూపరింటెండెంట్ ప్రేమకుమార్, నాయకులు సుమోశీన, నరసింహులు, తిరుమలేశ్, శంకర్ తదితరులు స్వాగతంపలికారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

హిందూపురం : పట్టణంలోని కొట్నూరు ఇందిరమ్మ కాలనీలో చేపట్టిన వెంకటరమణ ఆలయ నిర్మాణ పనులను వైసిపి నాయకులు వేణురెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నీలూరి వెంకటరాముడు, ఆలయ కమిటీ చైర్మన్ రంగప్పతో కమిటీ సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళానృత్యం

ధర్మవరం టౌన్ : శ్రీశైలంలో ఈనెల మూడవ తేదీన ధర్మవరం పట్టణానికి చెందిన మానస నృత్య కళా కేంద్రం వారు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మానస నృత్య కళాకేంద్రం అధ్యక్షురాలు మానస మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ఈ ప్రదర్శన ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. శ్రీ నిత్య, కీర్తి, సోమశేఖర్, హన్విత, మధుహాసిని, పురందేశ్వరి అనే చిన్నారులు చేసిన నృత్యం ఆకట్టుకుందన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కదిరి
O.S.NO:909/2022

Between:
యస్.పూర్ణిమ D/o యస్.మోహన్ నాయుడు, వయస్సు 49 సం॥లు హిందూ, వ్యవసాయం, R/o D.No:2/147, జొన్న వీధి, కదిరి టౌన్, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

మరియు

కాసాబత్తిని శ్రీనివాసులు S/o లేట్ కె.గంగయ్య వయస్సు 41 సం॥లు, హిందూ, వ్యాపారం, D.No:3-27-A-4-1, కోనేరు వీధి, కదిరి (పోస్టు మరియు టౌన్), శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

ఇందుమూలంగా తెలియజేయడము ఏమనగా పైన తెలిపిన వాది, ప్రతివాదిపై ప్రాంసరినోటు బాకీ వసూలు నిమిత్తం పై కోర్టు నందు దావా వేసియున్నారు. పై దావా తేది:26/12/2023న ఉదయం 10:30 గం॥లకు పైన తెలిపిన కోర్టు నందు ప్రత్యక్షంగా గాని వకీలు ద్వారా గాని హాజరు అయి అభ్యంతరములు, వాదనలు ఉన్న యెడల కోర్టు వారి ఎదుట తెలియపరచుకోగలరు. అట్లు హాజరు కాని యెడల పై దావా నీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:26/12/2023
స్థలం:కదిరి

ఎ.క్రిష్ణమూర్తి ఎమ్.ఎ., ఎల్.ఎల్.బి,
వాదితరపు న్యాయవాది, కదిరి.
సెల్:9440310692, 8886389692

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కదిరి
దావా.NO:134/2020

Between:
చిన్నకోట్ల క్రిష్ణవేణి W/o చిన్నకోట్ల విశ్వనాథ్, వయస్సు 43 సం॥లు హిందూ, వీవర్, R/o D.No:5-96, Old D.No:7-65A, పూల బజార్, తలుపుల గ్రామం మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

మరియు

చిన్నకోట్ల భూషణ S/o లేట్ చిన్నకోట్ల వెంగప్ప, వయస్సు 59 సం॥లు, హిందూ, వ్యవసాయం, మరియు ఎలక్ట్రిషియన్, R/o D.No:3-59, వేపమానిపేట (గ్రామం మరియు పోస్టు) తలుపుల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

ఇందుమూలంగా తెలియజేయడము ఏమనగా పైన తెలిపిన వాది, ప్రతివాదిపై ఇంజక్షన్ దావా వేసియున్నారు. పై దావా తేది:27/12/2023న ఉదయం 10:30 గం॥లకు పైన తెలిపిన కోర్టు నందు ప్రత్యక్షంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరు అయి నీ యొక్క వాదనలు మరియు అభ్యంతరములు తెలియపరచుకోగలరు. అట్లు హాజరు కాని యెడల పై దావా నీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:27/12/2023
స్థలం:కదిరి

ఎ.క్రిష్ణమూర్తి ఎమ్.ఎ., ఎల్.ఎల్.బి,
వాదితరపు న్యాయవాది, కదిరి.
సెల్:9440310692, 8886389692

హత్యకేసు నిందితులపై చర్యలు తీసుకోండి



సమస్యను వివరిస్తున్న బాధితులు, గ్రామస్తులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

తన మేనల్లుడు నాగరాజు హత్యకు కారకులైన వారిని శిక్షించాలని కోరుతూ బాధితురాలు మంగమ్మ సోమవారం జిల్లా ఎస్పీ మాధవ రెడ్డికి వినతి పత్రం అందజేసింది. గ్రామంలోని యువతిని ప్రేమించిన కారణంగా ఒక పథకం ప్రకారం హత్య చేసి, మద్యం తాగి మృతి చెందినట్లుగా నమ్మించారని బాధితురాలు మంగమ్మ తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు హిందూపురం మండల పరిధిలోని కొటిపి గ్రామానికి చెందిన బాధితురాలు మంగమ్మ తమకు జరిగిన అన్యాయాన్ని ఎస్పీకి వివరించింది. తన అన్న కుమారుడు నాగరాజును చిన్నతనం నుంచి తానే పెంచి పెద్ద చేశానని చెప్పారు. 25 సంవత్సరాలు వయసు గల నాగరాజు గ్రామంలో విద్యుత్తు పని, అదే విధంగా ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేసేవాడని అన్నారు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ యువతిని ప్రేమించాడన్నారు. ఈ విషయం విషయం తన దృష్టికి రావటంతో మందలించినట్లు వివరించారు. అప్పటినుంచి నాగరాజు బుద్ధిగా తన పని తాను చేసుకుంటూ వచ్చాడన్నారు. అయితే ఆ యువతి మేనమామ, ఆయన కుమారులు కలసి పథకం ప్రకారం నాగరాజును హత్య చేసి మద్యం తాగినట్లు చేసి ఇంటి వరండాలో పడుకోబెట్టి వెళ్లారని ఆరోపించారు. నాగరాజు అంత్యక్రియలు అయిన నాలుగైదు రోజుల తరువాత తమకు అనుమానం వచ్చిందని దీంతో పోలీసులను ఆశ్రయించామని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవటంతో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశామన్నారు. చివరకు అధికారులు స్పందించి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారని అయితే ఇంతవరకు పోస్టుమార్టు రిపోర్టు ఇవ్వలేదని చెప్పారు. కేసును తప్పుదోవ పట్టించి తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని బాధితురాలు ఆరోపించింది. ఈ కేసు విషయంలో నిజాయితీ గల పోలీసు అధికారిని నియమించి దర్యాప్తు చేసి, పూర్వపరాలను వెలికి తీయాలని బాధితురాలు ఎస్పీని కోరింది.


సదస్సు పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మిక సదస్సును విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో డిసెంబర్ 5, 6 తేదీల్లో కదిరి పట్టణంలో నిర్వహించే భవన నిర్మాణ కార్మిక రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సిపిఎం పుట్టపర్తి పట్టణ కార్యదర్శి బాళ్ల అంజి, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముత్యాలు తెలిపారు. ఈ మేరకు సదస్సుకు సంబందించిన పోస్టర్లను కొత్త చెరువులోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నీరు కారుస్తున్నాయని విమర్శించారు. సంక్షేమ పథకాలను కూడా వారికి అందకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేసి వారిని ఆదుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, ఎల్లప్ప, నారాయణ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా కమిటీలో ధర్మవరం నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సత్యసాయిజిల్లా యుటిఎఫ్ కార్యవర్గంలోకి ధర్మవరం జోనల్ నాయకులకు స్థానం కల్పించినట్లు ఆ శాఖ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎన్జీవో హోంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా రమీజాబీ, జిల్లాఆడిట్ సభ్యులుగా రమావత్ రామకృష్ణ నాయక్, పెద్దకోట్లసురేశ్, ఆది నారాయణ, మున్సిపల్ సబ్ కమిటీ కన్వీనర్‌గా బిల్లే రామాంజినేయులు, క్రీడా సబ్‌కమిటీ కన్వీనర్‌గా సకల చంద్రశేఖర్, సాంస్కృతిక సబ్ కమిటీ కన్వీనర్‌గా వినయ్‌కుమార్‌కు చోటు కల్పించామన్నారు. వీరికి జిల్లా కమిటీలో చోటు దక్కడం పట్ల యుటిఎఫ్ పట్టణ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హరికృష్ణ, సాయిగణేశ్, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆంజనేయులు, జనార్ధన్, రామగిరి మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శివయ్య, వినయ్, సీకేపల్లి మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కెఎం. నబీ, అమర్నాథ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.


యుటిఎఫ్ జిల్లా కమిటీలో ధర్మవరం జోన్ నాయకులు

నేడు తహసీల్దార్ కార్యాలయ ఎదుట ధర్నా : మున్సిపల్ ఉపాధ్యాయుల పరిష్కారం కోసం యుటిఎఫ్ దశల వారి పోరాట కార్యాచరణలో భాగంగా మంగళవారం సాయత్రం 4గంటలకు ధర్నా నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్ల సాధనకు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు.

సొసైటీ రైతులకు అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

చిగిచెర్ల సొసైటీ భూపంపిణీలో అధికారపార్టీ నాయకుల చొప్పినోళ్లకే పట్టాలు అందజేసి నిరుపేద అర్హులైన రైతులకు అన్యాయం చేశారని మాజీ జడ్పీచైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు చిగిచెర్ల ఓబిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మండలటీడీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో 1954లో సొసైటీ ఏర్పడిందని, ఈ సొసైటీలో ఎక్కువశాతం ఎస్సీలు, బీసీలు భూమిని సాగుచేసుకుంటున్నారని అన్నారు. ఆ భూమిని అధికారపార్టీ నాయకులు అధికారులతో కుమ్మక్కై, వారి అనుచరులకు ఎక్కువశాతం భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. ఎన్నోఏళ్లుగా సాగుచేసుకుంటున్న రైతులకు కూడా భూపంపిణీలో పట్టాలు ఇవ్వలేదన్నారు. అధికారపార్టీ నాయకులు సమీప ఉప్పునేసినపల్లి గ్రామానికి చెందిన ఎస్టీ రైతులకు సంబంధించిన అసైన్డు భూములను స్వాధీనం చేసుకుని వారికి కూడా ఈ సొసైటీ భూమిని ఇచ్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూమిలేని నిరుపేదలకు ఇవ్వకుండా వారి అనుచరులకే ఇచ్చారని ఆరోపించారు. ఈ భూములను ఇచ్చేందుకు అధికారులు ఏనాడు గ్రామసభ ఏర్పాటు కానీ భూములను పరిశీలించిన దాఖాలాలు లేవని అన్నారు. నిజమైన రైతుల కోసం కోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు. రైతులకు, భూమిలేని పేదలకు భూములను పంపిణీ చేయాలని ఇదివరకే కలెక్టరు, ఆర్డీవో, తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా నిజమైన రైతులకు, భూమిలేని పేదలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో రమేష్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, మాజీ జెడ్పీటీసీ మేకలరామాంజినేయులు, రాఘవరెడ్డి, కేశగాళ్ల శ్రీనివాసులు, అజయ్ కుమారెడ్డి, అనిల్ గౌడ్, భాస్కర్ చౌదరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి నాయకులు అన్నారు. మండలంలోని జొన్నల కొత్తపల్లి సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ప్రజాభివృద్ధే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ తిరుమల సేవ్ నాయక్, మల్ల గుండ్ల భాస్కర్, వెంకటేశ్వర రెడ్డి, పరంధామ రెడ్డి, సర్పంచులు , సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని 9వ వార్డులో వై ఎ పి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ కాచర్ల లక్ష్మి, పట్టణ అధ్యక్షులు నీలూరి ప్రకాష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మాసపల్లి సాయికుమార్, కౌన్సిలర్ చింతాఎల్లయ్య, నాయకులు చాంద్‌బాషా, చెలిమి పెద్దన్న, కత్తే పెద్దన్న, ఎల్ఐసి శ్రీరామ్, జెన్నే సూరి, వార్డు ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : పురపాలక సంఘ పరిధిలోని 10వ వార్డులో ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో వైసిపి జెండాను ఎగురవేసి, వార్డులో అభివృద్ధికి, సంక్షేమ పథకాలకు అందించిన నిధుల వివరాలతో కూడిన బోర్డులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి దీపిక, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు సాదిక్, శివశంకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రాచపల్లి మహేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఫరూక్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నాయకులు

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్ వాడి వర్కర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించక పోతే 8వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి నరసింహప్ప అన్నారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమ్మెకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యూటీని అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంచడంతో పాటు ఆఖరి వేతనంలో 50శాతం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తు, బీమా అమలు చెయాలన్నారు. ముఖ్యమంత్రి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కోశాధికారి శిరీష, సెక్టార్ లీడర్ శైలజ, నాగమ్మ, హెల్పర్ అంజనమ్మ, సిఐటియు నాయకులు రామకృష్ణ, లక్ష్మీకాంత్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి


పౌష్టికాహారాన్ని అందజేస్తున్న డిఇఒ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంత్, చిన్న పిల్లల వైద్యులు సివి మదన్ కుమార్ సూచించారు. పట్టణంలోని బాలికల పాఠశాల ఆవరణములో ఉన్న భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు చిన్నకృష్ణ, ఓబళరెడ్డి, హెచ్ఎం వెంకటాచలం సౌజన్య, షకీలా ,అన్వేష్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : వికలాంగ విద్యార్థులను అందరూ ప్రోత్సహించాలని డీఈవో మీనాక్షి దేవి, జిల్లా ఐఆర్‌డి కోఆర్డినేటర్ ఆనందబాబు తెలిపారు. పట్టణంలోని ఎర్లికేపురంలో గల భవిత సెంటర్లో సోమవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్, హెచ్ఎం నాగప్ప, భవిత స్కూల్ టీచర్లు సరస్వతి, మల్లికార్జున, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సోమవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒలు తిరుపాల్ నాయక్, చెన్నకేశవ కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్నప్రతిభా వంతులైన విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, పిఇటి సంధ్య, ప్రత్యేక ఉపాధ్యాయులు నరసింహుడు, వినయ్, ఎంఆర్‌సి సిబ్బంది రమేష్, మద్దిలేటి, వేమనారాయణ, అంజి, సుభద్ర, క్రిష్ణవేణి, కాసీంబీ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : సమాజంలో విభిన్న ప్రతిభావంతులను కూడా ఆదరించినప్పుడే వారు కూడా సకలాంగులతో సమానంగా రాణించగలరనిమండల విద్యాశాఖ అధికారులు చాముండేశ్వరి, సుధాకర్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన భవిత కేంద్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో సిఆర్‌పిలు ఖాదిరెడ్డి, ప్రసాద్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : వికలాంగులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు పొందాలని సత్యసాయి జిల్లా వికలాంగుల కోఆర్డినేటర్ ఆనంద్ బాబు ,జర్మనీ దేశానికి చెందిన గోరియా సుందరవల్లి తెలిపారు, కొత్త చెరువులోనే సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొత్తచెరువు బుక్కపట్నం పుట్టపర్తి మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలో చదివే వికలాంగులు, వారి తల్లిదండ్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులు అని బాధపడకుండా సక్రమంగా చదువుకోవాలన్నారు. చదువుతో పాటు ఆటల పట్ల మక్కువ చూపాలన్నారు. ప్రభుత్వం అందించే పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బుక్కపట్నం ఎంఇఒ గోపాల్ నాయక్, ఉపాధ్యాయులు మోహన్ బాబు, శ్రీనివాసులు, రామ్మోహన్ రెడ్డి, రమేష్ బాబు, పద్మజ, అరుణ, మల్లికార్జున, సరస్వతి, రమేష్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : వికలాంగులను చిన్నచూపు చూడొద్దని ఎంఇఒలు కృష్ణ నాయక్, శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ ఆలీ, గంగాధర్, రమేష్, రామ్మోహన్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

గుడిబండ : మండల పరిధిలోని కల్లురొప్పం గ్రామానికి చెందిన శ్రీరంగప్ప గుడిబండ మండలం మోరుబగల్ గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై కర్నాటకలోని మధుగిరి సమీపంలో భార్య పుట్టినింటికి వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి కిందపడగా శ్రీరంగప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన భార్యను సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీరంగప్ప తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు. ఇతనికి వివాహమైన 3 నెలలకే దంపతులిద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషా ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న తోటి రెవెన్యూ సిబ్బంది వారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

మేకను చంపిన కొండచిలువ

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద కమ్మవారిపల్లెలో మేతకు వెళ్లిన మేకను భారీ కొండచిలువ చంపిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బసవరాజు ప్రతి రోజు లాగే సోమవారం కూడా తన మేకలను మేత కోసం కొనబండ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో పొదల చాటున ఉన్న ఓ భారీ కొండచిలువ మేతమేస్తున్న మేకను చుట్టేసి చంపేసింది. మేకను చంపిన అనంతరం బుసలు కొడుతూ అక్కడే ఉన్న కొండచిలువను చూసి మేకల కాపరి గ్రామస్తులకు సమాచారాన్ని అందించాడు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్న గ్రామస్తులు భారీ కొండచిలువను చూసి హడలిపోయారు. విషయం తెలుసుకున్న స్నేక్ క్యాచర్ మూర్తి ఘటన స్థలానికి చేరుకుని అరగంట పాటు శ్రమించి భారీ కొండచిలువను బంధించాడు. అనంతరం ఆ కొండచిలువను సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. 15 అడుగుల పొడవున్న భారీ కొండచిలువను గతంలో తామెన్నడూ చూడలేదని గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఆర్చ్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కొత్తచెరువు రూరల్: మండల పరిధిలోని శెట్టిపల్లి క్రాస్ సమీపంలో సత్యసాయి స్వాగత తోరణం వద్ద ఆర్టీసీ బస్సు ఆర్చ్ ను ఢీకొన్న ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. కండక్టర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. సోమవారం పుట్టపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హిందూపురం వెళుతుండగా అదుపుతప్పి స్వాగత తోరణం దిమ్మెకు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ఒకవైపు పూర్తిగా ధ్వంసం అయింది. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో డ్రైవర్ వెంకటేష్ కు తీవ్ర గాయాలు కాగా అతడిని హుటాహుటిన పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కండక్టర్ సుజాతకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

ప్రమాదంలో గర్భిణికి గాయాలు

చిలమత్తూరు : మండల పరిధిలోని తుమ్మలకుంట క్రాస్ వద్ద ఆటో బోల్తాపడిన ప్రమాదంలో నల్లరాల్లపల్లికి చెందిన గర్భిణికి తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామానికి చెందిన 8నెలల గర్భిణి భాగ్యలక్ష్మి తమ సొంత ఆటోలో భర్తతో కలిసి ఆసుపత్రికి బయలుదేరింది. వీరి ఆటో తుమ్మలకుంట క్రాస్ వద్ద ప్రమాదవశాస్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో భాగ్యలక్ష్మి తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను 108లో హిందూపురం తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తీసుకెళ్లారు.

హెడ్ కానిస్టేబుల్ మృతికి సంతాపం

పుట్టపర్తి రూరల్: కదిరి రూరల్ పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నాగభూషణం (35) మృతికి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మృతుని కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. గుండెపోటుతో మృతి చెందిన కదిరి రూరల్ హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు (35) మృతదేహానికి సోమవారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య రామాంజనమ్మ, కుమార్తెలు సునైనా, వైష్ణవి ,కుమారుడు లక్ష్మణ్ గౌడ్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మెబాట

కొత్తచెరువు : విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ సర్వ శిక్ష అభియాన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జేఏసీ) అధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ మేరకు నాయకులు సోమవారం డిఇఒ కార్యాలయంలో సమ్మె నోటీసును సమర్పించారు. డిసెంబరు 20వ తేదీ నుండి విద్యాశాఖలో పని చేసే అన్ని విభాగాల ఉద్యోగులు సమ్మెలోకి వెళ్తున్నామని వారు చెప్పారు. సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని,సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్షులు వి.ఓబిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామన్న, ఉపాధ్యక్షులు ఓబులేసు, ముకుంద, కోశాధికారి రామసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి రవి,ఖాదర్, పసల నాగరాజు, సభ్యులు పోతలయ్య,మదర్ అలీఖాన్, అబీదాబి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పట్టాలివ్వాలి

ధర్మవరం టౌన్ : మండల పరిదిలోని రేగాటిపల్లి పంచాయతీలోని సొసైటీ భూములను అర్హులైన పేదలకే భూపంపిణీ పట్టాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యేగోనుగుంట్ల సూర్యనారాయణ అనుచరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ ఎఒ కుఫ్రాకు వినతిపత్రం అందజేశారు. రేగాటిపల్లిలో ఎన్నో ఏళ్లగా సాగులో ఉన్న పేదరైతులకు పట్టాలు ఇవ్వకుండా ఒకే సామాజిక వర్గానికిచెందిన, భూములున్న వారికే పట్టాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అదేవిధంగా నాలుగు నెలల క్రితం చిగిచెర్ల సొసైటీ భూముల్లో కూడా అనర్హులకు పట్టాలిచ్చారన్నారు. అర్హులైన పేదలకు భూపట్టాలు ఇవ్వకపోతే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆధ్వర్యంలో హైకోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిగిచెర్ల అరవిందరెడ్డి, గొట్లూరుచంద్ర, దుస్సాక్రిష్ణ, నారాయణస్వామియాదవ్, చిలకం సూర్యనారాయణ రెడ్డి, అశ్వర్థనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులుగా కందుకూరి శివ, లక్ష్మీనారాయణ

పుట్టపర్తి అర్బన్ : సత్య సాయి జిల్లా రెండవ కౌన్సిల్ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులుగా కందుకూరి శివ, లక్ష్మీనారాయణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం హిందూపురంలో జరిగిన జిల్లా రెండవ కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామని చెప్పారు. తమపై నమ్మకం ఉంచి ఎంపిక చేసిన యుటిఎఫ్ నాయకత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

6న టిడిపి నియోజకవర్గ స్థాయి సమావేశం

కదిరి టౌన్ : ఈనెల 6న తేదీన స్థానిక తాయిగ్రాండ్‌లో నియోజకవర్గ స్థాయి టిడిపి నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని టిడిపికి చెందిన సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, మాజీ ఎంపిటిసిలు, జెడ్పీటీసీ, మాజీ జెడ్పీటసీలు తదితరులు ఈసమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ నిధులు దుర్వినియోగం చేస్తున్న వైసిపి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

పుట్టపర్తి క్రైమ్ : టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి నియోజకవర్గ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం తెలుగుదేశం పార్టీ హయాంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి నిర్మించిన చిత్రావతి చెక్ డాంతో సెల్ఫీ దిగి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రావతి నదిపై నిర్మించిన చెక్ డ్యాంతో వందల ఎకరాలు సాగు అవుతోందన్నారు. బోరు బావుల్లో నీరు పెరిగిందని,పుట్టపర్తి పట్టణానికి ప్రధాన తాగునీటి వనరుగా ఈ చెక్ డ్యాం మారిందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.